# తొలి అక్షరం

చైర్మెన్ & ఎడిటర్ పస్తం సైదులు

తెలుగు దినపత్రిక

Epapper www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు సంపుటి : 01 సంచిక - 218 పేజీలు - 6 ఆదివారం 30 జూన్ 2024

## విలేకరులు కావలెను

**తొలి అక్షరం తెలుగు దిన పత్రిక**

వినూత్నంగా వెలువడుతూ, విశేష ప్రజాధరణ పొందుతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రికకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో విలేకరులు కావలెను.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాను tholiaksharam@gmail.comకి మెయిల్ చేయగలరు. సీనియర్లకు పాధ్రాన్యం, కొత్తవారికి కూడా అవకాశం,నియామకాలు జరుగుతున్నాయి వెంటనే సంప్రదించండి.



# పొట్టి కప్పును పట్టినం

**తొలి అక్షరం/బార్బడోస్,జూన్ 29 :** సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ..కోట్లాది మంది ప్రజల అకాంక్షలను నెరవేర్చుతూ టీమిండియా విశ్వవిజేతగా నిలిచింది. శనివారం చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో భారత్ ఏడు పరుగుల తేడాతో సౌతాఫ్రికాను ఓడించి ప్రపంచకప్‌ను సొంతం చేసుకుంది. అసాధారణ ఆటతో తొలిసారి విశ్వకప్ ఫైనల్‌కు దూసుకొచ్చిన దక్షిణాఫ్రికా చివరి వరకు గట్టిపోటీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. చిరస్మరణీయ ఆటతో అదరగొట్టిన టీమిండియా తన ఖాతాలో రెండో ప్రపంచకప్ ట్రోఫీని జతచేసుకుంది. ఇంతకుముందు 2007లో భారత్ తొలిసారి టి20 ప్రపంచకప్‌ను గెలుచుకుంది. బార్బడోస్‌లోని కెన్నింగ్‌స్టన్ ఓవల్ మైదానం వేదికగా జరిగిన ఫైనల్లో టాస్ గెలిచిన భారత్ బ్యాటింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన టీమిండియా 20 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. తర్వాత లక్ష్యఛేదనకు దిగిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది.

వివరాలు 2లో

## హైదరాబాద్‌తో సమానంగా

# వరంగల్ అభివృద్ధి



- వనమహొత్సవంలో మొక్కలు నాటిన సీఎం రేవంత్ రెడ్డి
- టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా అభివృద్ధి చేస్తామన్న సీఎం
- వరంగల్ అభివృద్ధిపై సమీక్ష
- ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పై సీఎం ఆదేశాలు
- నాలాల ఆక్రమణలు, నగరాభివృద్ధి ప్రణాళికలపై సీఎం రేవంత్

**తొలి అక్షరం/వరంగల్,జూన్ 29 :** హైదరాబాద్‌తో సమానంగా వరంగల్ ను అభివృద్ధి చెయ్యాలని, అందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతాన్ని తాము ప్రత్యేక జోన్‌గా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మధ్యాహ్నం ఒకటిన్నర గంటలకు గీసుకొండ మండలం శాయంపేటలోని టెక్స్టైల్ పార్క్ కు చేరుకున్నారు.

### వనమహొత్సవంలో మొక్కలు నాటిన సీఎం రేవంత్ రెడ్డి

రేవంత్ రెడ్డికి మంత్రులు కొండ సురేఖ, దనసరి అనసూయ అలియాస్ సీతక్క స్వాగతం పలికారు. వరంగల్ టెక్స్టైల్ పార్క్ నిర్మాణ పనుల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి పరిశీలించారు. టెక్స్టైల్ పార్క్‌లో వనమహొత్సవం లోగోను ఆవిష్కరించి, మొక్కలు నాటే కార్యక్రమంలో అటవీ శాఖ మంత్రి కొండ సురేఖతో కలిసి మొక్కలు నాటారు.

### టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా అభివృద్ధి చేస్తామన్న సీఎం

అనంతరం కైటెక్స్, యంగ్‌వన్ సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. టెక్స్‌టైల్ పార్క్ ప్రాంతాన్ని ప్రత్యేక జోన్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. టెక్స్‌టైల్ కోసం భూములు ఇచ్చినవారికి ఇందిరమ్మ ఇళ్లు అందించేలా కృషి చేస్తామన్నారు. టెక్స్‌టైల్ పార్క్ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణాన్ని రేవంత్ రెడ్డి పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### వరంగల్ అభివృద్ధిపై సమీక్ష

ఆపై గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించి వరంగల్ హనుమకొండ జిల్లాల, గ్రేటర్ వరంగల్, కుడా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌తో సమానంగా వరంగల్ ను అభివృద్ధి చేయాలన్నారు. హెరిటేజ్ సిటీగా వరంగల్ నగరాన్ని అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డుకు సంబంధించి భూసేకరణ పూర్తిచేయాలని అధికారులకు సీఎం సూచించారు.

### ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పై సీఎం ఆదేశాలు

ఇన్నర్, ఔటర్ రింగురోడ్డు భూసేకరణకు అవసరమయ్యే నిధులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. నేషనల్ హైవే నుంచి నేషనల్ హైవేకు కనెక్ట్ అయ్యేలా ఔటర్ రింగ్ రోడ్డు ఉండాలని సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి టెక్స్టైల్ పార్కుకు కనెక్టివిటీ ఉండేలా రోడ్డుమార్గం ఉండేలా చూడాలని పేర్కొన్నారు. స్మార్ట్ సిటీ మిషన్ లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టంను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చెయ్యాలన్నారు.

### నాలాల ఆక్రమణలు, నగరాభివృద్ధి ప్రణాళికలపై సీఎం రేవంత్

డ్రింకింగ్ వాటర్ లైన్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.నాలాలు ఆక్రమణలకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధిపై ఇకనుంచి ప్రతీ 20రోజులకోసారి ఇంచార్జ్ మంత్రి సమీక్ష నిర్వహించాలని సీఎం ఆదేశిం చారు. నగర అభివృద్ధికి సంబంధించి సహకారం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. వరంగల్‌లో డంపింగ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలన్న సీఎం, ఆ దిశగా ప్రణాళికలుసిద్ధంచేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.


# తెలంగాణలో ప్రతి ఊరికో మీ సేవా కేంద్రం

**తొలి అక్షరం/హైదరాబాద్, 29 జూన్ :** తెలంగాణలోని ప్రతి గ్రామంలో మీ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. స్వయం సహాయక సంఘాల మహిళలకు వీటిని కేటాయించనుంది. ఇందుకోసం రూ.2.50 లక్షల రుణాన్ని అందజేయనుంది. ఇంటర్ పాసైన మహిళలను మీసేవ ఆపరేటర్లుగా ఎంపిక చేసి, వారికి నెలపాటు శిక్షణ ఇచ్చి ఆగస్టు 15లోగా ప్రారంభించనుంది. గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల, ఇతర భవనాల్లో ఈ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు.

## సీఎం కేజ్రీవాల్‌కు 14 రోజుల

# జ్యుడీషియల్ కస్టడీ

**తొలి అక్షరం/ఢిల్లీ,జూన్ 29 :** ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అర్వింద్ కేజ్రీవాల్‌కు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది.ఇటీవల ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తీహార్ జైలు నుంచి అర్వింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ.. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపర్చింది. దాంతో కోర్టు మూడు రోజుల సీబీఐ రిమాండ్ విధించింది. ఇవాళ్టితో మూడు రోజుల సీబీఐ రిమాండ్ ముగియడంతో అధికారులు మరోసారి కేజ్రీవాల్‌ను కోర్టులో హాజరుపర్చారు. విచారణ కోసం కేజ్రీవాల్‌ను రెండు వారాల జ్యుడీషియల్ కస్టడీకి అప్పగించాలని కోర్టును కోరారు.దాంతో కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. జూలై 12 వరకు కేజ్రీ రిమాండ్ కొనసాగనుంది. కాగా ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు కేజ్రీవాల్‌ను ఈ ఏడాది ఫిబ్రవరి 19న అరెస్ట్ చేశారు. అప్పటి నుంచి ఆయనపై దర్యాప్తు కొనసాగుతోంది. ఈడీ కస్టడీలోనే తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌ను అదే కేసులో నాలుగు రోజుల క్రితం సీబీఐ అరెస్ట్ చేసింది. కేసుకు సంబంధించిన పలు వివరాలు రాబడుతోంది.



# డీఎస్ మరణం నన్ను ఎంతో బాధించింది : ప్రధాని మోదీ



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ధర్మపురి శ్రీనివాస్ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు.ఆయన మరణం నన్ను ఎంతగానో బాధించిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ఎక్స్ వేదిక ద్వారా సానుభూతి తెలిపారు.శనివారం తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో డీఎస్ తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నసమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి పార్థీవదేహాన్ని తరలించారు.1948 సెప్టెంబర్ 27న నిజామాబాద్‌లో జన్మించిన డీఎస్.. నిజాం కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. విద్యార్థి సంఘ నాయకుడిగా రాజకీయాల్లోకి వచ్చారు. ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్‌లో పనిచేశారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. తొలిసారిగా 1989లో కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల బరిలో దిగిన ఆయన.. నిజామాబాద్ అర్బన్

వివరాలు 2లో

# కొండగట్టులో మొక్కులు చెల్లించుకున్న పవన్ కళ్యాణ్



**తొలి అక్షరం/జగిత్యాల, జూన్ 29 :** కొండగట్టులోని ఆంజనేయస్వామిని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కాసేపటి క్రితం దర్శించుకున్నారు. పవన్ కళ్యాణ్ స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కు పండితులు వేదాశీర్వచనాలు అందించారు. ఎన్నికల ముందు వారాహి వాహనంలో కొండగట్టు అంజన్న సన్నిధిలో పవన్ కళ్యాణ్ పూజలు నిర్వహించారు. పవన్ పర్యటన దృష్ట్యా కొండగట్టు అంజన్న క్షేత్రంలో పోలీసులు భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. సిద్ధిపేటలో పవన్ అభిమానులు గజమాలతో సత్కరించారు. కారుపైకి ఎక్కి అభిమానులకు పవన్ అభివాదం చేశారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంలో బయల్దేరిన పవన్ కళ్యాణ్ మధ్యాహ్నం కొండగట్టు చేరుకున్నారు. ఆలయంలో పవన్ కు సంప్రదాయరీతిలో స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ ప్రస్తుతం వారాహి అమ్మవారి దీక్షలో ఉన్నారు. కొండగట్టుకు పవన్ వచ్చిన నేపథ్యంలో, జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయం వద్దకు భారీ సంఖ్యలో అభిమానులు చేరుకున్నారు.

## కాంగ్రెస్ నేత డి. శ్రీనివాస్ కన్నుమూత...



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** కాంగ్రెస్ సీనియర్ నేత మాజీ మంత్రి డి శ్రీనివాస్ గుండెపోటుతో తెల్లవారుజామున 3 గంటలకు మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డి శ్రీనివాస్ ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా పిసిసి అధ్యక్షుడిగా పని చేసిన డిఎస్.. 1948 సెప్టెంబర్ 27న నిజాంబాద్‌లో జన్మించిన డి శ్రీనివాస్ 1989, 1999 ,2004లో ఎమ్మెల్యేగా ఎన్నికై 2004, 2009 ఎన్నికల సమయంలో పిసిసి చీఫ్‌గా పనిచేశారు. తర్వాత కాంగ్రెస్కు రాజీనామా చేసి బిఆర్ఎస్‌లో చేరారు బి ఆర్ఎస్ నుంచి రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు.టిఆర్ఎస్‌ను వీడి సొంతగూటికి కాంగ్రెస్ చేరారు. డి శ్రీనివాస్ కు భార్య ఇద్దరు కుమారులు నిజాంబాద్ మేయర్ గా పనిచేసిన డీఎస్ పెద్ద కుమారుడు సంజయ్ నిజాంబాద్ బిజెపి ఎంపీగా ఉన్న రెండో కుమారుడు ధర్మపురి అరవింద్. హైదరాబాద్ నివాసంలో డిఎస్ పార్థివదేహం నివాసానికి కాంగ్రెస్ శ్రేణులు అభిమానులు చేరుకున్నారు. రేపు నిజమాబాద్ లో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

## భారత్ ఘన విజయం పట్ల సంతోషాన్ని వ్యక్తపరిచిన మంత్రి పొన్నం....




**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** టి20 క్రికెట్ ప్రపంచ కప్ ఫైనల్లో భారత్ ఘన విజయం పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు.17 ఏళ్ల నిరీక్షణ తరువాత టీ –20 వరల్డ్ కప్ లో భారత్ విజయం పట్ల తనకు సంతోషాన్ని కలిగించిందని తెలిపారు. కెప్టెన్ రోహిత్ బృందానికి అభినందనలు తెలిపారు. భారత్ టి –20 ప్రపంచ కప్ గెలవడం పట్ల దేశ ప్రజలకు , క్రికెట్ అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం రేపటి భవిష్యత్ క్రీడాకారులను మరింత ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుందని ఆకాక్షించారు.

## డీఎస్ మరణం నన్ను ఎంతో బాధించింది : ప్రధాని మోదీ

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గంలో గెలుపొందారు.అనంతరం 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించారు. 1989 నుంచి 1994 వరకు గ్రామీణాభివృద్ధి, ఐ అండ్ పీఆర్ మంత్రిగా, 2004 నుంచి 2008 వరకు ఉన్నతవిద్య, అర్బన్ లాండ్ సీలింగ్ శాఖ మంత్రిగా పనిచేశారు. 2004లో అప్పటి టీఆర్ఎస్‌తో పొత్తుకుదుర్చుకోవడంలో కీలకపాత్ర పోషించారు. 2013 నుంచి 2015 మధ్య ఎమ్మెల్సీగా సేవలందించారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత మండలి విపక్ష నేతగా పనిచేశారు. రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం రాకపోవడంతో 2015లో కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వ అంతర్ రాష్ట్ర వ్యవహారాల సలహాదారుగా పనిచేశారు. 2016 నుంచి 2022 వరకు బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడిగా పనిచేశారు.

## నీట్ యూజీ పేపర్ లీకేజీ కేసులో సీబీఐ తనిఖీలు

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :**నీట్ యూజీ పేపర్ లీకేజీ కేసులో సీబీఐ తనిఖీలు నిర్వహిస్తోంది. గుజరాత్‌లోని ఏడు ప్రదేశాల్లో సీబీఐ అధికారులు సోదాలు చేస్తున్నారు. అనుమానితుల ఇండ్ల వద్ద ఇవాళ ఉదయం నుంచి తనిఖీ జరుగుతున్నట్లు అధికారులు వెల్లడించారు.ఆనంద్, ఖేడా, అహ్మదాబాద్, గోద్రా జిల్లాల్లో ఈ సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందన్నారు. జార?ండ్‌లోని హజారీబాగ్‌కు చెందిన ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్‌ను సీబీఐ అరెస్టు చేసింది. నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో మరో హిందీ పత్రిక జర్నలిస్టును కూడా అరెస్టు చేశారు. నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో మొత్తం ఆరు ఎఫ్ఐఆర్‌లు నమోదు అయ్యాయి. కేంద్ర విద్యాశాఖ ఆదేశాల ప్రకారం ఒక ఎఫ్ఐఆర్ నమోదు కాగా, దర్యాప్తు జరుగుతున్న అయిదు రాష్ట్రాల్లో మిగితా కేసులు నమోదు అయ్యాయి. బీహార్, గుజరాత్‌ల నుంచి ఒక కేసు దర్యాప్తు జరగ్గా, రాజస్థాన్‌లో మూడు కేసుల్లో దర్యాప్తు జరుగుతోంది. ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ అడ్మిషన్ల కోసం నీట్ యూజీ పరీక్షలను ఎన్టీఏ నిర్వహిస్తుంది. ఈ ఏడాది మే 5వ తేదీన 4వేల 750 కేంద్రాల్లో ఆ పరీక్షలను నిర్వహించారు. సుమారు 23 లక్షల మంది ఆ పరీక్షలు రాశారు. జూన్ 23వ తేదీన సీబీఐ తన తొలి ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసింది.

## పొట్టి కప్పును పట్టినం

(మొదటి పేజీ తరువాయి)

**ఆరంభంలోనే..** ఊరిస్తున్న లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికాకు ఆరంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. ఓపెనర్ రిజా హెండ్రిక్స్ 4 పరుగులు మాత్రమే చేసి బుమ్రా వేసిన అద్భుత బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. ఆ వెంటనే కెప్టెన్ ఐడెన్ మార్క్రమ్ కూడా ఔటయ్యాడు. 4 పరుగులు చేసిన మార్క్రమ్‌ను అర్ష్‌దీప్ వెనక్కి పంపాడు. దీంతో సౌతాఫ్రికా 12 పరుగులకే రెండు వికెట్లను కోల్పోయింది. ఈ దశలో క్వింటన్ డికాక్, ట్రిస్టన్ స్టబ్స్‌లు కొద్ది సేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నారు. ఇద్దరు కుదురుగా ఆడుతూ స్కోరును ముందుకు తీసుకెళ్లారు. ధాటిగా ఆడిన స్టబ్స్ 3 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 31 పరుగులు చేసి అక్షర్ పటేల్ బౌలింగ్‌లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. **భయపెట్టిన క్లాసెన్..** తర్వాత వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగి పోయాడు. భారత బౌలర్లపై ఎదురుదాడి దాడి చేస్తూ స్కోరును పరిగెత్తించాడు. అతన్ని కట్టడి చేసేందుకు భారత బౌలర్లు చాలా కష్టపడాల్సి వచ్చింది. విధ్వంసక ఇన్నింగ్స్‌తో అలరించిన క్లాసెన్ వరుస సిక్సర్లతో హోరెత్తించాడు. మరోవైపు డికాక్ 4 ఫోర్లు, ఒక సిక్స్‌తో 39 పరుగులు చేసి అర్ష్‌దీప్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. అద్భుత ఇన్నింగ్స్ ఆడిన క్లాసెన్ 27 బంతుల్లోనే ఐదు భారీ సిక్సర్లు, రెండు ఫోర్లతో 52 పరుగులు చేసి హార్దిక్ బౌలింగ్‌లో పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత భారత బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ చేసి జట్టుకు చిరస్మరణీయ విజయం సాధించి పెట్టారు. చివర్లో బుమ్రా, హార్దిక్, అర్ష్‌దీప్‌లు కట్టుదిట్టమైన బౌలింగ్‌తో సౌతాఫ్రికాను కట్టడి చేశారు. అర్ష్‌దీప్, బుమ్రాలు చెరో రెండు వికెట్ల తీయగా, హార్దిక్ పాండ్యకు మూడు వికెట్లు దక్కాయి. **కోహ్లి మెరుపులు..** అంతకు ముందు తొలుత బ్యాటింగ్ చేసిన భారత్‌కు శుభారంభం లభించ లేదు. కెప్టెన్ రోహిత్ శర్మ (9), రిషబ్ పంత్ (0), సూర్యకుమార్ (3)లు విఫలమయ్యారు. అయితే విరాట్ కోహ్లి అద్భుత బ్యాటింగ్‌తో జట్టును ఆదుకున్నాడు. సౌతాఫ్రికా బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న విరాట్ స్కోరును ముందుకు నడిపించాడు. అతనికి అక్షర్ పటేల్ అండగా నిలిచాడు. కీలక ఇన్నింగ్స్ ఆడిన అక్షర్ పటేల్ 4 ఫోర్లు, సిక్సర్‌తో 47 పరుగులు చేశాడు. శివమ్ దూబె (27) తనవంతు పాత్ర పోషించాడు. ఇక అద్భుత బ్యాటింగ్‌ను కనబరిచిన కోహ్లి 59 బంతుల్లో ఆరు ఫోర్లు, రెడు సిక్సర్లతో 76 పరుగులు చేశాడు. భారత్ స్కోరు 176 పరుగులకు చేరింది.

# పీసీసీ రేసులో మంత్రి శ్రీధర్ బాబు..?

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** టీపీసీసీ చీఫ్ పదవి కాలం ముగియడంతో ప్రత్యామ్నాయ నాయకుని కోసం అధిష్టానం చూస్తోంది. క్యాబినెట్ విస్తరణతో పాటు పీసీసీ చీఫ్ ను ఎంపిక చేసే విషయంలో ఏఐసీసీ ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబులు కూడా ఢిల్లీకి వెళ్లిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వ్యవహారాన్ని చక్కదిద్దిన తరువాత మంత్రివర్గ కూర్పుకు సంబంధించిన అంశాలు చర్చించిన అధిష్టానం పీసీసీ చీఫ్ నియామకం కూడా గురించి కూడా లేవనెత్తినట్టుగా తెలుస్తోంది. పీసీసీ బాధ్యతలు ఎవరికి అప్పగిస్తే బావుంటుందన్న విషయంపై కసరత్తులు చేస్తున్న అధిష్టానం దృష్టిలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేరు కూడా ఉన్నట్టుగా తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కూడా శ్రీధర్ బాబు విషయంలో సానుకూలంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. అన్ని వర్గాలను కలుపుక పోతున్న శ్రీధర్ బాబుకు పీసీసీ చీఫ్ పదవిని కట్టబెడితే అస్మదీయులే ఉంటారు కానీ అసమ్మతి మాత్రం ఉండదని భావిస్తు న్నట్టుగా సమాచారం. సీఎం కూడా శ్రీధర్



బాబుకు పీసీసీ పగ్గాలు అప్పగించేందుకు అధిష్టానం వద్ద సుముఖత వ్యక్తం చేసినట్టుగా ప్రచారం జరుగుతోంది. బలమైన నాయకుడు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలపై పట్టు ఉన్న వ్యక్తి అయితే బావుంటుందని, వర్గ పోరుకు దూరంగా, క్లీన్ చిట్ ఉన్న నేతకు బాధ్యతలు అప్పగించినట్టయితే పార్టీకి కూడా మేలు జరుగుతుందని అధిష్టానం ఆలోచిస్తున్నట్టుగా సమాచారం. దీంతో శ్రీధర్ బాబుకు అదనంగా పీసీసీ బాధ్యతలు కూడా అప్పగించి నట్టయితే అన్నింటా మంచిదేనన్న యోచనలో ఉన్నట్టుగా సమాచారం.




## గ్రేటర్ ఆస్తుల పరిరక్షణపై సర్కార్ ఫోకస్..

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో చాలా ఏరియాల్లో కోట్ల విలువైన భూములపై అక్రమార్కులు కన్నేస్తున్నారు. ఇటీవలే మియాపూర్‌లో రాత్రికి రాత్రే టెంట్లు వేసి ఆక్రమించడానికి ప్రయత్నించారు.అడ్డుకోవడానికి వచ్చిన పోలీసులపై దాడులకు తెగబడ్డారు. ఇదే కాకుండా జీహెచ్ఎంసీ పరిధిలో చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో సీఎం రేవంత్ సర్కార్ రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా కమిషనర్ అసెట్స్ ప్రొటక్షన్ అండ్ డిజాస్టర్ మేనేజ్మెంట్ పేరుతో ప్రత్యేకంగా విభాగాన్ని ప్రవేశపెట్టే యోచనలో ప్రభుత్వం ఉంది.ఇప్పటి వరకు ఉన్న అసెట్స్ ప్రొటక్షన్ లో విలీనం చేయనున్నారు. పరిధికి ఈవీడీఎంను విస్తరించనున్నారు. ఆస్తుల రక్షణ కోసం ముగ్గురు ఎస్పీ స్థాయి అధికారులు, 8 మంది డీఎస్పీలు, సీఐలు, డిప్యూటీ కలెక్టర్లు, జీహెచ్ఎంసీ వాటర్ బోర్డు, ఫైర్ అధికారులను ప్రభుత్వం కేటాయించనుంది. మొత్తం మూడు వేల మంది సిబ్బందితో ప్రత్యేక టీం ఏర్పాటు చేయనున్నారు.

## డీఎస్‌కు నివాళి అర్పించనున్న కేంద్రమంత్రి బండి సంజయ్

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మపురి శ్రీనివాస్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న డీఎస్..తెల్లవారు జామున 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు పలువురు ప్రముఖులు నివాళి అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో డీఎస్ అంత్యక్రియలు జరపనున్నది.అయితే కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హైదరాబాద్ రానున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి నేరుగా నిజామాబాద్‌లోని డీఎస్ నివాసానికి చేరుకోనున్నారు. డీఎస్‌కు నివాళి అర్పించడంతోపాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. అనంతరం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ నివాసానికి వెళ్లనున్నారు. రమేశ్ రాథోడ్ భౌతిక కాయానికి బండి సంజయ్ నివాళి అర్పించనున్నారు.



## చిరకాలం మా గుండెల్లో నిలిచిపోయే తమ్ముడు సాయిచంద్ : కేటీఆర్



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** చిరకాలం మా గుండెల్లో నిలిచిపోయే తమ్ముడు సాయిచంద్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ గాయకుడు, మాజీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలోవారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు కేటీఆర్. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సాయిచంద్ మరణించి ఏడాది అవుతుందంటే ఎవరం నమ్మలేకపోతున్నాం. తన మాటతో, పాటతో అద్భుతమైన వాగ్దాటితో తెలంగాణ ప్రజలను ఉర్రూతలూగించిన అద్భుత కళాకారుడు సాయిచంద్. మన అందరి ఆప్తుడు.. చిరకాలం మా గుండెల్లో నిలిచపోయే తమ్ముడు. భవిష్యత్‌లో సాయి కుటుంబం కోసం ఎల్లవేళలా పార్టీ తరపున ఆ కుటుంబానికి అండగా ఉంటాం. ఆనాటి నుంచి నేటి వరకు ఎలా అండగా ఉన్నామో భవిష్యత్‌లో కూడా ఉంటాం. సాయి జ్ఞాపకార్థం పాటల సీడీలు, సంకలనాలు, పుస్తకాలు తీసుకొచ్చిన సోదరులకు అభినందనలు. తమ్ముడి ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను అని కోరుకుంటూ కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

## మాజీ మంత్రి డీఎస్ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** మాజీ మంత్రి డి శ్రీనివాస్ మరణం పట్ల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు శనివారం తెల్లవారుజామున 3 గంటలకు హైదరాబాద్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. గుండెపోటుతో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రిగా, పీసీసీ అధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. 2004, 2009లో మంత్రిగా సేవలందించారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉన్నారు. ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నసమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అంతా ఆయనను డీఎస్ అని పిలిచేవారు. ప్రస్తుతం ఆయన మృతదేహాన్ని జూబ్లీహిల్స్‌లోని ఆయన ఇంట్లోనే ఉంచారు. సాయంత్రం నిజామాబాద్ ప్రగతినగర్‌లోని ఆయన నివాసానికి పార్థీవదేహాన్ని తరలించనున్నారు. డీఎస్ అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించనున్నారు.



# జర్నలిస్ట్ కొల్లూరి నాగరాజు కుటుంబానికి బొంపెల్లి పరామర్శ



**తొలి అక్షరం/పర్వతగిరి,జూన్29:** పర్వతగిరి మండల కేంద్రంలో ఆదాబ్ హైదరాబాద్ పత్రిక రిపోర్టర్ కొల్లూరి నాగరాజు కుమారుడు కొల్లూరి రేవంత్ కుమార్ ఇటీవల హైదరాబాదులో జరిగిన ఆకస్మిక రోడ్డు ప్రమాదంలో కొద్ది రోజులు ఆసుపత్రిలో చికిత్స పొంది ఇటీవల మరణించడం జరిగింది.ఈ విషయం తెలుసుకున్న కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బొంపెల్లి దేవేందర్ రావు వారి కుటుంబాన్ని పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతి తెలియజేసి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు కందికట్ల అనిల్,పర్వతగిరి మండల సీనియర్ నాయకులు ఆడెపు కుమారస్వామి,వంగాల రవీందర్, నోముల రమేష్,డీలర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా నిర్మిస్తున్న ఆలయ నిర్మాణానికి విరాళం



**తొలి అక్షరం/పర్వతగిరి,జూన్29:** పర్వతగిరి మండలం వడ్లకొండలో రంగనాయకుల స్వామి గుట్ట ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న సీతారామాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కొరకు బెజ్జం సంపత్ భార్య బెజ్జం విజయ కూతురు నవ్య వడ్లకొండ వాస్తవ్యులు తమ వంతు సహాయంగా విరాళం రూ.10,116 అక్షరాల పది వెయ్యిల నూట పదహార్లు నగదు రూపకంగా అందజేశారు.

# బూరుగుమల్ల పంచాయతి కార్యదర్శి సత్యనారాయణ పదవీ విరమణ



**తొలి అక్షరం/పర్వతగిరి,జూన్29:** పర్వతగిరి మండలం లోని బూరుగుమల్ల పంచాయతి కార్యదర్శి సత్యనారాయణ పదవీ విరమణ సందర్భంగా జరిగిన సన్మాన కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జిల్లా కోఆప్టేడ్ సభ్యులు మహ్మద్ సర్వర్ సన్మానసభకు ఎంపిపి కమల అధ్యక్షత వహించగా ఎంపిడిఓ శంకర్ నాయక్, ఎంపివో శ్రీనివాస్, ఎంపిటిసిలు మాడుగుల రాజు,బొట్ల మహేంద్ర, మాజీ సర్పంచులు రమేష్ నాయక్,తౌటి దేవేందర్, కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్ లు,ఇతర అధికారులు పాల్గొన్నారు. పదవీ విరమణ పొందుతున్న సత్యనారాయణ దంపతులను పూల మాలలు శాలువాలతో అందరూ సన్మానించారు.

# తొర్రూర్ పట్టణ కేంద్రంలో లారీ ఢీకొని వ్యక్తి మృతి

**తొలి అక్షరం/తొర్రూర్ రూరల్,జూన్29:** తొర్రూర్ పట్టణ కేంద్రంలో వరంగల్ టు ఖమ్మం రహదారిపై తొర్రూర్ బస్టాండ్ సమీపంలో రోడ్డు క్రాస్ చేస్తున్న నంగునూరు నాగన్న (62)ను లారీ డీకొట్టడంతో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం వరంగల్ కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు.మృతుడు నెల్లికుదురు మండలం నైనాల గ్రామానికి చెందిన స్థానికులు గుర్తించారు.



# పత్తి వరి నారుమలను పరిశీలించిన వ్యవసాయ విస్తరణ అధికారి జి.సందీప్

**తొలి అక్షరం/దంతాలపల్లి,జూన్29:** తూర్పు తండ గ్రామంలో పత్తి,వరి నారుమలను పరిశీలించడం జరిగింది.ఈ పరిశీలనలో భాగంగా ప్రస్తుతం ప్రత్తి పంటలో విత్తన 10 రోజులకు మొలక రాని చోట మళ్లీ విత్తుకోవాలి, రెండు మొలకలు ఉన్నచోట పీకి వేసి కుదురుకి ఒక మొక్క ఉండేలా చూసుకోవాలి.కలుపు నివారణకై విత్తిన 24 నుంచి 48 గంటలలోపు 1.2లీటర్స్ పెండిమితలిన్ ఒక ఎకరానికి నేలపై పిచికారి చేసుకోవాలి.నెలరోజుల పంటలో గడ్డి వెడల్పాకు కలుపు నివారణకు క్విజోల్ పాప్ ఈథైల్ 400ఎంఎల్,లేదా క్విజోల్ పాప్ ఈథైల్, పైరితయో బ్యాక్ సోడియం 500 ఎంఎల్ మందును 200 లీటర్ల నీటికి కలిపి ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలి.పత్తిని 30 నుంచి 45 రోజులలోపు రసం పీల్చే పురుగుల నివారణకు ఫ్లోనికమిడ్ ఒక పాలు 20 పాల్ల



నీటికి కలిపి కాండంపై లేత ఆకుపచ్చ భాగంపై 30, 45,60 రోజులకు ఒకసారి బొట్టు పెట్టిన తక్కువ ఖర్చుతో రసం పీల్చే పురుగులను నివారించుకోవచ్చును. అదేవిధంగా వరి పంటలో నారుమడిలో రెండు గంటల నారు వాడికి నారుమడి కి రెండు కిలోల నత్రజని,ఒక కేజీ బాస్వరం ఒక కేజీ పొటాష్ ఇచ్చే ఎరువులను వేసుకోవాలి. నారుమడిలో కలుపు నివారణకు 0.5 ఎంఎల్ బిస్పైర్ బ్యాక్ సోడియం ఒక లీటరు నీటికి కలిపి విత్తిన 10 నుంచి 12 రోజులలో పిసికారి చేసుకోవాలి. నారు పీకడానికి వారం రోజుల ముందు ఒక ఎకరానికి సరిపడి నారు మడికి 800 గ్రాముల కార్బో ఫ్లూరాన్ త్రి జి గుళికలు చల్లుకోవాలి. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమ కెరటం సాయిచంద్



**-సేవలు చిరస్మరణీయం ఘనంగా ప్రథమ వర్ధంతి వేడుకలు**

**-మాల మహానాడు రాష్ట నాయకులు దాసరి ప్రకాష్**

**తొలి అక్షరం/నెల్లికుదురు,జూన్29:** ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగసి పడుతున్న సమయంలో కెరటం లాగా తన ఆట పాటలతో ప్రజలను చైతన్య పరిచిన మహా గాయకుడు సాయిచంద్ ప్రజల గుండెల్లో కలకాలం నిలిచిపోతరని మాలమహానాడు రాష్ట్ర నాయకులు దాసరి ప్రకాష్ కొనియాడారు. శనివారం నెల్లికుదురు మండల కేంద్రం డా,,బీఆర్ అంబేద్కర్ సెంటర్లో తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ మాల ముద్దుబిడ్డ కీ,,శే వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతి వేడుకలు మాల మహానాడు మండల అధ్యక్షులు కారం ప్రశాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాల మహానాడు రాష్ట్ర నాయకులు దాసరి ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని అయన మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమం సమయంలో సాయి చంద్ మారుమూల గ్రామాల్లోని యువకుల చైతన్య పరిచిన ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లడంలో సాయి చంద్ పాత్ర అమోగమైందని అయన సేవలు చిరస్మరణీయమన్నారు. ఈకార్యక్రమంలోమాల మహానాడు జిల్లా నాయకులు మాదరి ప్రశాంత్,బింగి సురేందర్,బహుజన నాయకులు వంగాల ఈశ్వర్,తుళ్ల వివేక్, జిలుకర శ్రీధర్, గార అనిల్,గార అమీన్,గార వరుణ్,హెచ్చు అశోక్, ప్రజాసంఘాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆకాశానందుతున్న కూరగాయలు,ఉల్లి ధరలు

- **కేజీ టమోటా రూ.100**
- **కేజీ ఉల్లిగడ్డ రూ.75**
- **సామాన్యులకు పట్ట పగలు చుక్కలు**
- **ఏమి కొనలేనిపరిస్థితిలో పేద ప్రజలు**

**తొలి అక్షరం/నర్సింహులపేట,జూన్29:** సహజంగా వేసవి రాగానే కూరగాయల ధరలు పెరుగుతాయి.వర్షాకాలం ప్రారంభం కాగానే ధరలు కాస్త తగ్గుతాయి.కానీ ఈ సంవత్సరం అందుకు భిన్నంగా ఎండాకాలం ధరలు నామమాత్రంగా పెరిగి, వర్షాకాలం మొదట్లో ధరలు అమాంతం చుక్కలను తాకుతున్నాయి.ఉల్లిపాయల నుంచి కూరగాయల వరకు అన్ని ధరలు పెరగడంతో సామాన్యుల పరిస్థితి దారుణంగా తయారయింది.కూరగాయలు, ఉల్లిపాయలు కొనలేని ధరలు మార్కెట్లో కేజీ టమాట వంద రూపాయలు.కేజీ ఉల్లిగడ్డ రూ.75,కిలో బీరకాయలు రూ.80,కిలో బెండకాయ రూ.60,కిలో బ్రిడ్జి రూ.100,కిలో బీట్రూట్ రూ.90,కిలో క్యారెట్ రూ. 120,మంచి చిక్కుడు రూ.160,కిలో కోతిమీరి రూ.120.వివిధ రకాల కూరగాయలు పేదలు కొనాలన్న కిలో వంద రూపాయలు తగ్గడం లేదు ఏం కొనేటట్టు లేదు ఏం తినేటట్టు లేదు అంటూ సామాన్యులు కూరగాయలను,




ఉల్లిపాయలను కొనాలంటే లబోదిబోమంటున్నారు.ప్రస్తుతం దాదాపు అన్ని కూరగాయల ధరలు కిలో రూ.80 రూపాయల వరకు పలుకుతున్నాయి.15 రోజుల వ్యవధి లోనే ఉల్లిపాయలు,టమాట సహా అన్ని కూరగాయల ధరలు 100 శాతం వరకు పెరిగాయి.డిమాండ్ కు తగ్గట్టు ఉత్పత్తి లేకపోవడంతో ధరలు పెరుగుతున్నట్టుగా తెలుస్తుంది.అమాంతం పెరిగిపోయిన కూరగాయల ధరలు మే నెల మూడో వారంలో 20 రూపాయలు పలికిన ఉల్లిపాయల ధరలు,కిలో ప్రస్తుతం 50 నుండి 75రూపాయలకు చేరింది.టమాటా ధర కూడా ప్రస్తుతం కిలో 50 నుండి 100.రూపాయలకు పైనే పలుకుతుంది. ఇక క్యారెట్, వంకాయలు, బీన్స్, బీరకాయలతో పాటు ఆకుకూరల ధరలు కూడా అమాంతం పెరిగాయి.తెలంగాణ జనాభాకు ప్రతి ఏడాది 38.54 లక్షల టన్నుల కూరగాయలు అవసరమవుతాయి.

**తెలంగాణాలో డిమాండ్‌కు తగ్గటు లేని కూరగాయల ఉత్పత్తి**

అయితే ప్రస్తుతం 19.54 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి అవుతున్న పరిస్థితి ఉంది. ప్రజల అవసరాలకు తగ్గట్టుగా ఉత్పత్తి లేకపోవడం, ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతులు చేసుకోవాల్సి రావడం కారణంగా కూరగాయల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయి. రెక్కాడితే కానీ డొక్కాడని కుటుంబాలలో బాగా పెరిగిన కూరగాయల ధరలు, ఉల్లిపాయల ధరలు కూరగాయలు కొనాలంటే కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.ప్రస్తుతం నిత్యవసర వస్తువుల ధరలతో పాటు, కూరగాయల పైన కూడా పడుతున్న ధరాఘాతం సామాన్యులకు శరాఘాతంగా మారింది. ఇప్పటికైనా ప్రభుత్వం కొండెక్కి కూర్చున్న కూరగాయలు, ఉల్లిపాయల ధరలను తగ్గించేందుకు చర్యలు తీసుకుంటే బాగుంటుందన్న అభిప్రాయం సామాన్యుల నుండి వ్యక్తం అవుతుంది.ఇప్పటికైనా ప్రభుత్వ సంబంధించి ప్రతి గ్రామంలో మార్కెట్లో కూరగాయలు ధరలు తగ్గించాలని మహిళా మండల సంఘాలు పలు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

# టీవైజెఎఫ్ మెదక్ జిల్లా సమావేశానికి అందరూ హాజరు కావాలి

**- టీవైజెఎఫ్ మెదక్ జిల్లా అధ్యక్షుడు వి.మధుసూదనాచారి**



**తొలి అక్షరం/పాపన్నపేట,జూన్29:** జులై 1న మెదక్ జిల్లా వెల్దుర్తి గ్రామంలోని శ్రీ బాలాజీ మినీ ఫంక్షన్ హాల్ లో జరగనున్న టీవైజెఎఫ్ ఆత్మీయ సమ్మేళన సమావేశానికి మెదక్ జిల్లాలోని టీవైజెఎఫ్ జర్నలిస్టులందరూ సకాలంలో హాజరు కావాలని ఆ జిల్లా అధ్యక్షుడు మధుసూదనాచారి,జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ ప్రవీణ కోరారు.ఈ సమావేశం టీవైజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మహబూబ్ పర్యవేక్షణలో జరగనుందని.ఈ సమావేశానికి టీవైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, సీనియర్ జర్నలిస్ట్,డాక్టర్ తనుగుల జితేందర్ రావు సార్,జిల్లా నాయకులు హాజరుకానున్నారని వారు తెలిపారు.ఈ సమావేశంలో టీవైజెఎఫ్ యూనియన్ కు సంబంధించిన విషయాలపై చర్చ సాగుతుందని కనుక ప్రతి ఒక్కరు కచ్చితంగా సకాలంలో హాజరై ఈ ఆత్మీయ సమ్మేళన సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నామన్నారు.

# విద్య హక్కు చట్టం అమలు పరచాలి

**- విద్య వ్యవస్థపై 15% నిధులు కేటాయించాలి: బహుజన ప్రజాశక్తి డిమాండ్**

**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** విద్యా పూర్తిగా ప్రైవేట్ పరం కావడంతో విద్యను కొనుక్కునే పరిస్థితి ఉందని వెంటనే రాష్ట్రంలో విద్య హక్కు చట్టాన్ని అమలు పరచాలని బహుజన ప్రజాశక్తి డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా బడ్జెట్లో 15 శాతం నిధులు కేటాయించాలని కోరింది. విద్య హక్కు చట్టం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బహుజన ప్రజాశక్తి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రకుల నిరుపేద వర్గాల హక్కుల ఉద్యమ వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర కన్వీనర్ నల్ల లక్ష్మణ్ నేతృత్వంలో శనివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివిధ సంఘాల ప్రతినిధులు నారగోని, గోపి, రమేష్ కుమార్,అజయ్,భరత్ భూషణ్, వెంకటేష్,నరసింహ, నల్ల నగేష్, కే స్వామి మద్దతు కలిపి మాట్లాడారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థలో అధిక ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి ప్రైవేటు కార్పొరేట్ సంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత స్కీముల స్థానంలో అన్ని వర్గాల వారికి స్కూల్ నుండి పీజీపీహెచ్డీ వరకు ఉచిత విద్యను అందించాలని కోరారు.

# గుండుంబా పై అలుపెరగని యుద్ధం ప్రకటించిన జిల్లా ఎస్పీ

**- తెల్లవారుజామున నుండి గుడుంబా స్టావారాలపై విరుచుకుపడ్డ జిల్లా పోలీసులు**







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో(సాంబ),జూన్29:** మహబూబాబాద్ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా లో గుడుంబా పూర్తి నిర్మూలనకు పని చేస్తున్న మహబూబాబాద్ జిల్లా పోలీస్ యంత్రాంగం. మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాలమేరకు జిల్లా వ్యాప్తంగా గుడుంబా స్టావారాలపై పోలీసుల దాడులు నిర్వహించారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా గుడుంబా సావరాలపై దాడులు నిర్వహించారు. జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మహబూబాబాద్ జిల్లా పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్ నుండి అధికారులు సిబ్బంది కలసి గుడుంబా స్టావారాలపై దాడులు నిర్వహించారు.ఈ దాడులలో 33 కేసులు నమోదు చేయడం జరిగింది.అలాగే 328 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, నల్ల బెల్లం 210 కేజీలు, 8870 లీటర్ల చెక్కెర పానకాన్ని ధ్వంసం చేసినట్లు మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు.జిల్లా వ్యాప్తంగా జరిపిన ఈ దాడులలో అధికారులు,సిబ్బంది కలిపి 174 పోలీసులు పాల్గొన్నారు.మహబూబాబాద్ జిల్లా లో గుడుంబా స్తావరాలకు చోటు లేదన్నారు.ఎవరైనా అక్రమంగా గుడుంబా తయారీ చేసినట్లయితే వారిని బైండోవర్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.మహమ్మారిలాంటి గుడుంబాకు అలవాటు పడి ఎంతోమంది కుటుంబాలను చిన్నబిన్నం చేసుకొని చివరకి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు.అంతే కాకుండా మీ చుట్టుప్రక్కల ప్రాంతాల్లో ఎవరైనా గుడుంబా తయారీ చేస్తునట్టు తెలిసిన అమ్మిన వెంటనే దగ్గరలోని పోలీసు స్టేషన్ లో సమాచారం అందించాలని కోరారు. వారి వివరాలు గొప్యంగా ఉంచడం జరుగుతుందని అన్నారు. ఇకపై గుడుంబా రహిత జిల్లా గా మానుకోట ఉండబోతుందని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ తెలిపారు.

# నూతన చట్టాలు - మరెన్నో కష్టాలు

**- కోర్టులపై భారం - న్యాయవాదుల అణంగీకారం**

**- గాడిపల్లి గణేష్ గౌడ్ (ఎల్ఎల్బి)**



**తొలి అక్షరం/నర్సింహులపేట,జూన్29:** సమాచార హక్కు రక్షణ చట్టం 2005 సంస్థ జిల్లా యూత్ అధ్యక్షుడు గాడిపెల్లి గణేష్ గౌడ్ తనదైన వివరణాత్మక శైలిలో కింది విధంగా ప్రజాస్వామ్య దేశాలలో ప్రజలకు ఉపయోగపడే చట్టాలు తేవడంలో శాసనసభ ముఖ్య పాత్ర పోషిస్తుంది. మన భారతదేశంలో ఉన్నటువంటి పార్లమెంటరీ వ్యవస్థలో భాగంగా దేశానికి, దేశంలోని పరిస్థితులకు అనుగుణంగా కావలసిన చట్టాలను చేయడంలో, చేసిన చట్టాలలో సవరణలు చేయడంలో మన పార్లమెంటు ముఖ్య పాత్ర పోషిస్తుంది. భారత పార్లమెంట్ ముఖ్యమైన పాత చట్టాలను రద్దు చేసి భారతీయ న్యాయ సంహిత 2023, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత 2023 మరియు భారతీయ సాక్ష్యా అధినియం 2023 అనే మూడు నూతన చట్టాలను అమలుపరిచే దిశగా విడుదల చేసిన గెజిట్ ప్రకారం జులై ఒకటో తారీకు నుండి అమలుగాపోతున్న ఈ మూడు చట్టాలు భారత దేశ న్యాయ వ్యవస్థ పై పెను భారం మోపబడుతుంది. అదేవిధంగా న్యాయమూర్తులపై, న్యాయవాదులపై తీవ్రమైన ఒత్తిడితో కూడుకున్న పనిభారం కూడా ఉంటుంది. ఇట్టి నూతన చట్టాలలో ప్రస్తుత సమాజ పోకడకు సంబంధించి ఎటువంటి ఉపయోగకరమైన, ముఖ్యమైన మార్పులు ఏమి కూడా ఈ నూతన చట్టాలలో జరగలేదు. అదేవిధంగా ఈ నూతన చట్టాలలో రాజ్యానికి (ప్రభుత్వానికి), పోలీస్ యంత్రాంగానికి ఎక్కువ అధికారాలు కట్టబట్టడం అనేది ప్రజాస్వామ్య దేశానికి మంచిది కాదు అనేది న్యాయ శాస్త్ర నిపుణుల,రిటైర్డ్ న్యాయమూర్తుల, సీనియర్ న్యాయవాదుల అభిప్రాయం.ఈ నూతన చట్టాలలో ముఖ్యంగా అధ్యాయాల కుదింపు సెక్షన్ల క్రమం మార్పు తప్ప నేరాల అర్ధాలు, తీవ్రత, శిక్షలు పెద్దగా మార్పులు చేర్పులు ఏమీ లేవు. కాబట్టి ఇట్టి చట్టాలు ప్రస్తుత న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యలకు మరో కొత్త సమస్యగా మారి న్యాయవస్థకు తలబారమే తప్ప ప్రయోజనము లేదు. ప్రస్తుత సమాజంలో ఉన్న సమస్యల పరిష్కారానికి ఉపయోగ యోగ్యం లేకపోవడమే కాకుండా కొత్త సమస్యలు సృష్టించే విధంగా ఉన్న ఈ చట్టాలను ప్రజాస్వామ్య విలువలను దృష్టిలో ఉంచుకొని, ప్రభుత్వము ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి, కోర్టులపై న్యాయవాదులపై భారం లేకుండా వారి అనుభవాలను, అభిప్రాయాలను మరియు దీనిపై దేశ పౌరుల యొక్క విభిన్న అభిప్రాయాలను కూడా తీసుకున్న తర్వాత వాటిని పరిశీలించి తదనునుగుణంగా మార్పులు చేర్పులు చేసి ప్రస్తుత న్యాయవ్యవస్థలో పెండింగ్ లో ఉన్న కేసుల పరిష్కారానికి తోడ్పాటు అయ్యేలా ఈ చట్టాలను అమలు పరచాలని న్యాయ విద్యార్థిగా సమాచార హక్కు రక్షణ చట్టం 2005 జిల్లా యూత్ అధ్యక్షుడిగా ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు.

# అర్హులకే రైతు భరోసా...

**- రైతు భరోసా నిధులను పక్కదారి పట్టనివ్వకుండా మార్గదర్శకాలు - సాగు భూమి ఎంత ఉన్నది గ్రామాల వారీగా తనిఖీ - రియల్ ఎస్టేట్ భూములు, గుట్టలు, కొండలు, సాగు చెయ్యని దేవదాయ వక్ఫ్ భూములకు కట్**



**తొలి అక్షరం/హైదరాబాద్,జూన్ 29 :** ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ పథకాల్లో రైతు భరోసా అనేది ఒక కీలకమైన పథకం. అయితే ఈ పథకం అమలు విషయంపై ఏమాత్రం డబ్బు అనేది వృధా కాకూడదు అని కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాన్ చేస్తుంది. రైతు భరోసా నిధులను పక్కదారి పట్టనివ్వకుండా మార్గదర్శకాలను కూడా రెడీ చేస్తుంది. ఏ పథకం అయినా సరే అర్హులు అయిన వారికి మాత్రమే అందాలి. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రైతుబంధు పథకానికి సంబంధించిన నిధులు అన్నీ కూడా పక్కదారి పట్టాయి అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం. రైతు భరోసా పథకాన్ని మాత్రం అలా నీరు కార్చే ప్రసక్తి లేదు అని అంటుంది. అయితే అనర్హులను ఏరిపారేసి నిజమైన రైతులకు మాత్రమే అమలు చేస్తాము అని అంటుంది. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా ఈ స్కీమ్ ను అమలు చేస్తాం అని తెలిపింది. ఈ స్కీము కు సంబంధించి ప్రభుత్వం, గ్రామాల వారీగా తనిఖీ చేస్తూ సాగు భూమి ఎంత ఉన్నది. రియల్ ఎస్టేట్ భూములు ఎన్ని ఉన్నాయి. గుట్టలు, కొండలు ఎన్ని ఉన్నాయి. సాగు చెయ్యని దేవదాయ వక్ఫ్ భూములు ఏవి ఉన్నాయి. అనే వివరాలు అన్నింటినీ సేకరిస్తు వ్యవసాయ శాఖ పూర్తిస్థాయిలో మూడు రోజులుగా సర్వేలు చేస్తున్నది. వచ్చే వారం కల్లా ఈ సర్వే అనేది పూర్తి అవుతుంది.బిఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పేరుతో ప్రతి రైతుకు ఏడాదికి ఎకరానికి రూ.10,000 చొప్పున పెట్టుబడి సాయం అనేది అందించింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రూ. 15,000 అందిస్తామని హామీ ఇచ్చింది. అంతేకాక రైతు మరియు కౌలు రైతులకు కూడా సంవత్సరానికి ఎకరానికి రూ.15,000 ఇస్తాము అని ఎన్నికల మ్యానిఫెస్టోలో తెలిపింది. అంతే రైతు కూలీలకు ఎకరానికి సంవత్సరానికి రూ.12000 ఇస్తామని హామీ ఇచ్చింది. కానీ ఇంతవరకు కూడా ఈ స్కీమ్ అనేది అమలు కాలేదు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కి రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని రైతులకు ఇవ్వాల్సి ఉన్నది. కానీ అనర్హులను తొలగించేందుకు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నది. ఈ ప్రక్రియ అనేది పూర్తి అయితే గాని రైతు భరోసా స్కీమ్ అనేది అమలు కాదు. అప్పటి వరకు కూడా రైతుబంధు కిందే ఈ నిధులు అనేవి పంపిణీ చేయడం జరుగుతుంది.కొత్త మార్గదర్శకాల అమలు ప్రకారం చూసినట్లయితే, ప్రభుత్వ ఉద్యోగులు మరియు ఐటి చెల్లింపు దారులు,ప్రజా ప్రతినిధులు, బడా వ్యాపార వేత్తలకు ఈ పథకం అనేది అస్సలు వర్తించదు. అంతేకాక బీడు భూములు, రోడ్లు,రియల్ ఎస్టేట్ వెంచర్లకు కూడా ఈ నిధులు అనేవి అందవు. ఇలా చేయటం వలన ప్రభుత్వానికి చాలా డబ్బు మిగులుతుంది. రైతు భరోసా పథకం అనేది ఐదు ఎకరాల లోపు రైతులకు మాత్రమే ఇవ్వాలి అని ప్రభుత్వం భావిస్తున్నట్లుగా తెలిపింది. అలా చేస్తే గనుక రైతుల ఆగ్రహం చూస్తారు అని బిఆర్ఎస్ అంటుంది. అయితే అయిదు ఎకరాల కంటే ఎక్కువ ఉన్న రైతులు నష్టపోవాలా అని ప్రశ్నిస్తుంది. మూడు సంవత్సరాలుగా సాగు చేయని రైతులకు కూడా రైతు భరోసా అనేది ఇవ్వరు అని తెలుస్తుంది. ఈ మార్గదర్శకాలు అనేవి ఇంకా అధికారికంగా రాలేదు.

## ఎస్సై జి.కరుణాకర్ ఆధ్వర్యంలో గుడుంబా స్థావరాలపై దాడులు





**తొలి అక్షరం/దంతాలపల్లి,జూన్29:** మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలోని దుబ్బ తండా రెవిన్యూ (తూర్పు తండా), మేలకుంట తండా (రెవెన్యూ గున్నేపల్లి)లో వచ్చిన సమాచారం మేరకు గుడుంబా స్థావరాలపై పోలీస్ లు దాడులు నిర్వహిం చారు. దుబ్బ తండా గుడుంబా స్థావరంలో తొమ్మిది లీటర్ల గుడుంబా స్వాధీనం,300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు.మేలకుంట తండాలో గుడుంబా స్థావరం నుండి ఆరు లీటర్ల గుడుంబా స్వాధీనం,100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు.

## గౌరవంగా పదవి విరమణ పొందడం అదృష్టం

**- జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపిఎస్**





**తొలి అక్షరం/భూపాలపల్లి, జూన్ 29:** ప్రజల కోసం అహర్నిశలు పనిచేసి గౌరవ ప్రదంగా పదవీ విరమణ పొందడం అదృష్టమని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ శ్రీ కిరణ్ ఖరే ఐపీఎస్ అన్నారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తున్న ఎస్సై సిహెచ్ ప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పి. ఎస్సై ని సత్కరించి, ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఎక్కువ కాలం పనిచేసి సేవలు అందించడం అభినందనీయ అన్నారు. ఎన్నో రకాల త్యాగాలతో పాటు కుటుంబాలకు దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం ఎంతో గర్వకారణమన్నారు.ప్రతి ఉద్యోగి జీవితంలో పదవీ విరమణ తప్పదని అన్నారు. సుమారు 40 సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసిన ఎస్.ఐ ప్రసాద్ సేవలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ వారి అనుభవం, సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తివంతంగా నిలుస్తాయని చెప్పారు. పదవి విరమణ ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని ఎస్పి గారు సూచించారు. పదవి విరమణ అనంతరం కుటుంబ సభ్యులతో అనందంగా వారి భావిజీవితం ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో గడపాలని ఆకాంక్షినారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డిఎస్పి సంపత్ రావు, చిట్యాల సిఐ మల్లేష్, రిజర్వు ఇన్ స్పెక్టర్లు శ్రీకాంత్, రత్నం, పోలీస్ అధికారుల సంఘం నేత యాదిరెడ్డి, ఏఎస్ఐ ప్రతాపరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ సురేష్, రిటైర్డ్ ఎస్సై ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం!

**- రైతుల పాడిగేదెలు మృతి**

**తొలి అక్షరం/ఖిలా వరంగల్ , 29 జూన్:** వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు ఖిలా వరంగల్ మండల పరిధిలోని మామునూర్ తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బండి శ్యామ్, ఎల్లయ్య లకు చెందిన రెండు పాడి గేదలు మామునూరు పరిసర ప్రాంతాలలో మేతకు వెళ్లగా గాలి వానకు తెగి నేలపై పడిన కరెంట్ తీగలకు పాడి గేదెలు తాకి అక్కడికక్కడే మృతి చెందాయి.ఆ విషయం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గారి దృష్టికి రావడంతో వారు వెంటనే సంబంధిత వెటర్నిటీ డాక్టర్లతో మాట్లాడి పంచనామా చేయించి ప్రభుత్వం తరఫున పారితోషకం ఇప్పించి ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇవ్వటం జరిగిందని రైతు తెలిపారు.

# భారత బ్యాటర్లు షంసీని టార్గెట్ చేస్తే చాలు: ఉతప్ప



**ఇంటర్నెట్ డెస్క్:** టీ20 ప్రపంచ కప్‌లో దక్షిణాఫ్రికా స్పిన్నర్ తంబ్రిజ్ షంసీ అత్యంత ప్రభావం చూపిస్తున్నాడు. నాలుగు మ్యాచుల్లోనే 11 వికెట్లు తీశాడు.స్పిన్‌కు సహకరించే విండీస్ పిచ్‌లపై అతడిని ఎదుర్కోవడం కఠినమైన సవాల్ అని క్రికెట్ విశ్లేషకుల అభిప్రాయం. అయితే, భారత్‌తో ఫైనల్‌లో  అతడే ఎక్కువ పరుగులు ఇస్తాడని మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప వ్యాఖ్యానించడం గమనార్హం.''షంసీ తుది జట్టులో ఉంటే నేను చాలా సంతోషిస్తా. బార్బడోస్ వేదికగా జరగనున్న మ్యాచ్‌లో  బార్ట్‌మన్ కూడా ఉండాలి. వీరిద్దరిలో ఒకరికే అవకాశం అంటే మాత్రం షంసీ వైపు మొగ్గు చూపిస్తా. ఎందుకంటే అతడి బౌలింగ్‌లోనే భారత బ్యాటర్లు టార్గెట్ చేసి ఎక్కువ పరుగులు రాబట్టేందుకు వీలుంది. అతడు వికెట్లు తీసినా.. కనీసం 45౦ పరుగులు సాధించే అవకాశం ఉంది. ఇప్పుడున్న భారత బ్యాటింగ్ లైనప్‌ను చూసి ఈ మాట చెబుతున్నా. మనకు అతడు ఉండటం బిగ్ డీల్ అవుతుంది'' అని ఉతప్ప  తెలిపాడు. **షంసీ బౌలింగ్‌లో ఇలా..: అశ్విన్...** ''షంసీ బౌలింగ్‌లో ఎక్కువగా స్వీప్ షాట్లు ఆడాలి. ఈ విషయంలో భారత బ్యాటర్లు పరిస్థితి బెటర్‌గానే ఉంది. అదిల్ రషీద్, లివింగ్‌స్టోన్ బౌలింగ్‌లో ఇలానే ఆడి పరుగులు రాబట్టారు. ఈసారి కూడా అలాంటి మ్యాచ్ ప్రదర్శనే చేయాలి. అయితే, తుది జట్టులో షంసీని ఉంచుతారా? బార్ట్‌మన్‌ను తీసుకుంటారా? అనేది చూడాలి'' అని అశ్విన్  వెల్లడించాడు.**బుమ్రా, కుల్‌దీప్‌ను కాచుకుంటేనే: మోర్కెల్...** తొలిసారి ఫైనల్‌కు చేరిన దక్షిణాఫ్రికా కప్‌ను అందుకోవాలంటే.. టీమ్‌ఇండియా  జట్టులోని ఇద్దరు బౌలర్లతో జాగ్రత్తగా ఉండాలని మాజీ క్రికెటర్ మోర్నీ మోర్కెల్ సూచించాడు. ''జస్‌ప్రీత్ బుమ్రా, కుల్‌దీప్ యాదవ్ బౌలింగ్‌ను జాగ్రత్తగా ఆడాలి. ఒత్తిడిని దరిచేరనీయకూడదు. ఒక్కో బంతిపై దృష్టిపెడుతూ ఇన్నింగ్స్ సాగాలి. డెత్ ఓవర్లలో బుమ్రా మరింత ప్రమాదకరంగా మారతాడు. కాబట్టి మంచి స్కోరును చేసి లక్ష్యంగా నిర్దేశించేందుకు టీమ్‌ఇండియా ప్రయత్నిస్తుంది. బుమ్రా, కుల్‌దీప్ గురించి ఎక్కువ ఆందోళన చెందక్కర్లేదు. వారిని గౌరవిస్తూనే.. మిగతా బౌలింగ్ ఎటాక్‌ను లక్ష్యం చేసుకోవాలి'' అని మోర్కెల్ తెలిపాడు.

# దక్షిణాఫ్రికాతో ఏకైక టెస్టు.. రెండో రోజు ముగిసిన ఆట



**చెన్నై:** దక్షిణాఫ్రికాతో ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత అమ్మాయిల జట్టు భారీ విజయం దిశగా సాగుతోంది. ఓవర్ నైట్ 525/4 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత్..603/6 వద్ద డిక్లేర్డ్ చేసింది. అనంతరం దక్షిణాఫ్రికా మొదటి ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. రెండో రోజు ఆట ముగిసేసరికి ఆ జట్టు 236/4 స్కోరు చేసింది. ఓపెనర్లు వోల్వార్ట్ (20), అన్నేకే (39) పరుగులు చేశారు. వన్‌డౌన్ బ్యాటర్ సునే లూస్ (65) అర్ధ శతకం బాదింది. డెల్మీ టక్కర్ (0) డకౌట్ అయింది. ప్రస్తుతం మారిజానే కాప్ (69లిబీ 125 బంతుల్లో 8 ఫోర్లు), నాడిన్ డి క్లర్క్ (27లిబీ 28 బంతుల్లో 5 ఫోర్లు) క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో స్నేహ్ రాణా 3, దీప్తి శర్మ ఒక వికెట్ పడగొట్టారు.తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు చేసిన టీమ్‌ఇండియా అద్భుతమైన రికార్డు సృష్టించింది. 90 ఏళ్ల ఉమెన్స్ టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యధిక స్కోరు చేసిన జట్టుగా భారత్ అవతరించింది. అంతకుముందు ఆస్ట్రేలియా పేరిట ఈ రికార్డు ఉండేది. ఇదే ఏడాది ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికాపైనే 575/9 (డిక్లేర్డ్) ఆసీస్ స్కోరు చేసింది. ఓవర్ నైట్ 525/4 స్కోరుతో రెండో రోజు ఆటను ప్రారంభించిన భారత బ్యాటర్లు హర్మన్ (69), రిచా ఘోష్ (86) ఐదో వికెట్‌కు 143 పరుగులు జోడించారు. ఆ తర్వాత వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు.

# టీమిండియాను ఓడించాలంటే అలా ఆడాలి: రికీ పాంటింగ్



టీ20 ప్రపంచకప్ 2024 ఫైనల్లో టీమిండియాను ఓడించాలంటే ఎలాంటి ఒత్తిడికి లోనవ్వకుండా స్వేచ్ఛగా ఆడాలని సౌతాఫ్రికా క్రికెటర్లకు ఆసీస్ దిగ్గజం రికీ పాంటింగ్ సూచించాడు.మరికొద్ది గంటల్లో బార్బోడస్ వేదికగా ప్రారంభమయ్యే ఈ మెగా ఫైనల్లో టీమిండియా, సౌతాఫ్రికా అమీతుమీ తేల్చుకోనుంది.ఇరు జట్లు సంచలన ప్రదృనతో ఓటమెరుగని టీమ్స్‌గా ఫైనల్‌కు అర్హత సాధించాయి. ఓవైపు 11 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలని టీమిండియా భావిస్తుంటే.. మరోవైపు తొలిసారి ఫైనల్ చేరిన సౌతాఫ్రికా విజేతగా నిలవాలని ఉవ్విళ్లూరుతోంది. అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చిన 32 ఏళ్ల తర్వాత సౌతాఫ్రికా ప్రపంచకప్ ఫైనల్‌కు అర్హత సాధించింది.ఈ క్రమంలోనే సౌతాఫ్రికా ఆటగాళ్లకు రికీ పాంటింగ్ కీలక సూచనలు చేశాడు. 'ప్రపంచకప్ ఫైనల్ చేరిన ప్రతీ టీమ్.. ఇతర మ్యాచ్‌ల్లానే ఈ మ్యాచ్ కూడా అని చెబుతుంటారు. పెద్ద వేడుక కాదనే విషయాన్ని దాచే ప్రయత్నం చేస్తారు. కానీ ఇది ఏ మాత్రం సరికాదు. ఫైనల్ ఆడుతున్నామనే ఉత్సాహం ప్రదర్శించాలి. సౌతాఫ్రికా ఆటగాళ్లకు గతంలో ప్రపంచకప్ ఫైనల్ ఆడిన అనుభవం లేదు. కాబట్టి ఈ రాత్రిని ఆస్వాదించే ప్రయత్నం చేయాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆడాలి. ప్రిపరేషన్స్, ఆటలో ఏ మాత్రం తేడా లేకుండా ఆడాలి. ఈ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా సౌతాఫ్రికా ఓడిపోలేదు. కాబట్టి వాళ్లు తమ ఆటలో పెద్దగా మార్చుకోవాల్సిన అవసరం లేదు. కొత్త ప్రయత్నించాల్సిన పని కూడా లేదు. కేవలం తమ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చే ప్రయత్నం చేయాలి. జట్టుగా సమష్టిగా రాణించేందుకు కృష్టి చేయాలి. ఇలా చేస్తే టీమిండియాపై ఘన విజయం సాధించగలరు.'అని రికీ పాంటింగ్ పేర్కొన్నాడు.

# జట్టు ఫామే కీలకం.. విరాట్ గురించి ఆందోళన అక్కర్లేదు: మంజ్రేకర్



**ఇంటర్నెట్ డెస్క్:** టీ20 ప్రపంచకప్‌లో భారత టాప్ బ్యాటర్లలో విరాట్ కోహ్లీ ఒక్కడి నుంచే భారీ ఇన్నింగ్స్ బాకీ ఉంది. సెమీస్ వరకు జరిగిన మ్యాచుల్లో ఒక్కసారి మాత్రమే రెండంకెల స్కోరు నమోదు చేశాడు.అతడి ఫామ్ గురించి అభిమానుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. కనీసం ఫైనల్‌లోనైనా మంచి ఇన్నింగ్స్‌తో ఆకట్టుకుంటాడని ఎదురు చూస్తున్నారు. అయితే, కోహ్లీ బ్యాటింగ్ గురించి ఆందోళన అక్కర్లేదని.. ఒక్కసారి కుదురుకుంటే అతడిని ఆపడం చాలా కష్టమని భారత మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ వ్యాఖ్యానించాడు. ''విరాట్ కోహ్లీ ఫామ్ కంటే జట్టు ఫామ్ అత్యంత ముఖ్యం. ఈ విషయంలో టీమ్‌ఇండియా చాలా మెరుగ్గా ఉంది. కోహ్లీ కూడా రాణిస్తాడనే నమ్మకం ఉంది. తప్పకుండా భారత్ ప్రపంచ కప్ టైటిల్‌ను గెలుస్తుందని భావిస్తున్నా. ఇప్పుడు జట్టంతా కలిసి కట్టుగా ఆడుతోంది. ఒకరిపైనే ఆధారపడి లేదు. అది టీమ్‌ఇండియాకు సానుకూలాంశం. దక్షిణాఫ్రికా జట్టులో నోకియా, రబాడ, డికాక్ కీలక ప్లేయర్లు. ఆ జట్టు పేస్‌ను తట్టుకోగలిగితే గెలవడం పెద్ద కష్టమేం కాదు'' అని మంజ్రేకర్ వెల్లడించాడు. **రోహిత్‌కు బదులు రషీద్.. క్రికెట్ ఆస్ట్రేలియా జట్టిదే..** సూపర్-8లోనే ఇంటిముఖం పట్టిన ఆస్ట్రేలియా జట్టు అందుకు కారణమైన టీమ్‌ఇండియాపై మరో రూపంలో అక్కసు వెళ్లగక్కింది. గతేడాది వన్డే ప్రపంచ కప్ ఫైనల్‌లో భారత్‌పై ఆసీస్ గెలిచింది గుర్తుంది కదా.. ఇప్పుడు ఆ ఓటమికి రివెంజ్ తీర్చుకున్న రోహిత్ శర్మను కాదని.. మరొకరిని సారథిగా ఎంపిక చేసిన క్రికెట్ ఆస్ట్రేలియా తన టీ20 వరల్డ్ కప్ జట్టును ప్రకటించింది. అఫ్గాన్ సారథిగా ఉన్న రషీద్ ఖాన్‌ను ఈ టీమ్ కెప్టెన్సీ బాధ్యతలు ఇచ్చింది. సూపర్-8 గ్రూప్1 నుంచి టీమ్‌ఇండియాతోపాటు అఫ్గాన్ సెమీస్‌కు చేరిన సంగతి తెలిసిందే. భారత్ నుంచి రోహిత్‌తోపాటు హార్దిక్ పాండ్య, బుమ్రాకు జట్టులో చోటు కల్పించింది.టీమ్ ఇదే: రోహిత్ శర్మ, ట్రావిస్ హెడ్, నికోలస్ పూరన్, ఆరోన్ జోన్స్, మార్కస్ స్టాయినిస్, హార్దిక్ పాండ్య, రషీద్ ఖాన్ (కెప్టెన్), రిషద్ హుస్సేన్, ఆన్రిచ్ నోకియా, జస్‌ప్రీత్ బుమ్రా, ఫజల్‌హక్ ఫరూఖీ

# ఒక ఏడాదిలో ఇన్ని విజయాలా? రోహిత్ అన్నా.. నీ నాయకత్వం అదుర్స్..



వన్డే వరల్డ్ కప్‌లో అప్రతిహత విజయాలు సాధించింది. ఫైనల్ దాకా దూసుకెళ్లింది. ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో భంగపాటు మినహా.. మిగతా అన్ని మ్యాచ్లలో భారత్ ఏకపక్ష విజయం సాధించింది.లీగ్ దశలో ఆస్ట్రేలియాను మట్టికరిపించింది. ఇంగ్లాండ్ కు చుక్కలు చూపించింది. దక్షిణాఫ్రికాను బెంబేలెత్తించింది. పాకిస్తాన్ ను పడుకోబెట్టింది. న్యూజిలాండ్ ను వణికించింది. అద్భుతమైన విజయాలు సాధించి ఏకంగా ఫైనల్ దాకా దూసుకెళ్లింది. భారత్ సాధించిన ఈ వరుస విజయాల వెనక కెప్టెన్ రోహిత్ శర్మ ఉన్నా డు. వన్డే వరల్డ్ కప్ దక్కకపోయినప్పటికీ.. కొద్ది రోజు లకే టెస్ట్ ఛాంపియన్షిప్ ఫైనల్లోకి భారత్ దూసు కెళ్లింది. ఇక్కడ ఆస్ట్రేలియా నుంచి పోటీ ఎదురయింది. చివరికి టెస్ట్ ఛాంపియన్షిప్ కూడా వదులుకోవాల్సి వచ్చింది. ఇప్పుడు టి20 వరల్డ్ కప్.. వరుస విజయాలతో భారత్ ఫైనల్ దూసుకెళ్లింది. కప్ కోసం దక్షిణాఫ్రికా జట్టుతో తలపడనుంది. వాస్తవానికి ఒక జట్టు ఒక సంవత్సరం కాలంలో.. ఐసీసీ నిర్వహించిన మూడు మేజర్ కప్ లలో ఫైనల్ వెళ్లడం అంటే మామూలు విషయం కాదు. బహుశా ఈ రికార్డు మరే జట్టుకు సాధ్యం కాకపోవచ్చు. ఇలాంటి రికార్డును టీమిండియా పాదాక్రాంతం చేసిన ఘనత రోహిత్ శర్మకు దక్కుతుంది. ఐపీఎల్ లో తన సారథ్యంలో ముంబై ఇండియన్స్ జట్టును ఐదుసార్లు విజేతగా నిలిపాడు. అంతేకాదు తన నాయకత్వంలో టీం ఇండియన్ కూడా అదే స్థాయిలో నడిపిస్తున్నాడు. ఏడాది వ్యవధిలో మూడు ఐసీసీ టోర్నీలలో టీమిండియాను ఫైనల్ దాకా చేర్చాడు. విరాట్ కోహ్లీ తర్వాత కెప్టెన్సీ బాధ్యతలు అందుకున్న రోహిత్ శర్మ.. తన మార్క్ నిర్ణయాలతో జట్టుకు అద్భుతమైన విజయాలు అందించాడు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్షిప్, వన్డే వరల్డ్ కప్ టైటిళ్లను భారత జట్టు త్రుటిలో చేజార్చుకున్నప్పటికీ.. ఆ బాధను దిగ మింగుకొని.. టి20 వరల్డ్ కప్ లో టీమిండియాను ఫైనల్ దాకా చేర్చాడు రోహిత్ శర్మ. **ఆటగాళ్ల ఎంపికలో..** ఆటగాళ్ల ఎంపికలో రోహిత్ శర్మ చాలా భిన్నంగా వ్యవహరి స్తాడు. ప్రతి విషయంలోనూ తన మార్క్ చూపిం చేందుకు ప్రయత్నిస్తాడు. ప్రస్తుత టి20 వరల్డ్ కప్ కోసం నలుగురు స్పిన్నర్లను ఎంపిక చేశాడు. వాస్తవా నికి ఈ నిర్ణయం చాలా మందిని ఆశ్చర్యపరిచింది.. పేస్ బౌలింగ్ కు అనుకూలంగా ఉండే వెస్టిండీస్ లో నలుగురు స్పిన్నర్లు ఎందుకు అని సీనియర్ క్రికెటర్లు ప్రశ్నించారు. ముఖ్యంగా అక్షర్ పటేల్ ఎంపికను చాలామంది తప్పు పట్టారు. ఆ విషయంలో రోహిత్ మౌనాన్ని మాత్రమే ఆశ్రయించాడు. టోర్నీ మొదలైన తర్వాత అక్షర విలువ ఏంటో తెలుస్తుందని రోహిత్ పరోక్షంగా వ్యాఖ్యానించాడు. రోహిత్ చెప్పినట్టుగానే అక్షర్ పటేల్ ఏడు మ్యాచ్లలో ఎనిమిది వికెట్లు నేలకూ ల్చాడు. ముఖ్యంగా సెమీ ఫైనల్ మ్యాచ్లో ఇంగ్లాండ్ జట్టును కకావికలం చేశాడు.. మూడు వికెట్లను పడగొట్టడంతో పాటు, ఒక రనౌట్ కూడా చేశాడు. పాకిస్తాన్ తో జరిగిన మ్యాచ్ లోనూ తన సత్తా చూపించాడు.కెప్టెన్ గానే కాకుండా అటాకింగ్ ఆట తీరుకు రోహిత్ శర్మ పెట్టింది పేరు. విధ్వంసకరమైన బ్యాటింగ్ తో ప్రత్యర్థి బౌలర్లపై ఒత్తిడి పెంచడంలో దిట్ట. పలుమార్లు తన ఆటతీరుతో అనేక జట్ల బౌలర్లకు సింహ స్వప్నం లాగా మిగిలాడు. ప్రస్తుత టి20 వరల్డ్ కప్ లోనూ అదే స్థాయిలో ఆటను ప్రదర్శిస్తున్నాడు. ముఖ్యంగా సూపర్ -8 మ్యాచ్లో ఆస్ట్రేలియాపై ఏకంగా 92 పరుగులు చేసి తన సత్తాను మరోసారి చాటాడు. సెమీ ఫైనల్ మ్యాచ్లో ఇంగ్లాండ్ జట్టుపై అర్ధ సెంచరీ సాధించి తన బ్యాటింగ్ స్టైల్ వేరే లెవెల్ అని నిరూ పించాడు. తన బ్యాటింగ్ ద్వారా మిగతా ఆటగాళ్లలో స్ఫూర్తి నింపుతూ.. ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడేలా చేస్తున్నాడు.ఇక ఈ టోర్నీలో రోహిత్ బౌలర్లను సమర్థవంతంగా ఉపయోగించుకుం టున్నాడు. ప్రత్యర్థి బ్యాటర్లకు తగ్గట్టుగా ఫీల్డింగ్ సెట్ చేస్తున్నాడు. మైదానంలో ఉన్న పరిస్థితులను ఆకలింపు చేసుకొని.. వ్యూహాలు రచిస్తున్నాడు. కొత్త ప్రణాళికలను అమలులో పెడుతున్నాడు. రోహిత్ శర్మ మరికొద్ది గంటల్లో ప్రారంభమయ్యే ఫైనల్ మ్యాచ్లో కొనసాగిస్తే టీమిండియా కచ్చితంగా టైటిల్ గెలుస్తుందని అభిమానులు చెబుతున్నారు.

# విరాట్ సంచలన నిర్ణయం.. టీ ట్వంటీలకు కోహ్లీ గుడ్ బై

భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. అంతర్జాతీయ టీ ట్వంటీలకు గుడ్ బై చెప్పాడు. టీ ట్వంటీ వరల్జ్ కప్ గెలిచిన వెంటనే తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించాడు.నిజానికి చాలా మంది కోహ్లీ టీ ట్వంటీ రిటైర్మెంట్ ను ముందే ఊహించారు. 2022 వరల్డ్ కప్ తర్వాత రెండేళ్ళ పాటు టీ ట్వంటీలు ఆడలేదు. కేవలం ఐపీఎల్ మాత్రమే ఆడుతూ జాతీయ టీ ట్వంటీ టీమ్ కు మాత్రం దూరమయ్యాడు. అయితే వరల్డ్ కప్ కు ముందు మళ్ళీ టీ ట్వంటీ జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. ప్రపంచకప్ గెలవాలన్న తన కలను నెరవేర్చుకునేందుకు జట్టులోకి వచ్చిన విరాట్ మెగా టోర్నీలో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేదు. సెమీస్ వరకూ అతను 75 పరుగులే చేయడం ఫ్యాన్స్ ను నిరాశకు గురి చేసింది.అయితే కీలకమైన ఫైనల్లో మాత్రం విరాట్ అదరగొట్టేశాడు. ఆరంభంలోనే 3 వికెట్లు కోల్పోయిన దశలో కోహ్లీ కీలకమైన ఇన్నింగ్స్ ఆడాడు. అక్షర్ పటేల్ తో కలిసి మ్యాచ్ ను నిలబెట్టే ఇన్నింగ్స్ ఆడాడు. 76 పరుగులు చేసిన కోహ్లీ భారత్ భారీస్కోర్ సాధించడంలో కీలకపాత్ర పోషించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత మాట్లాడిన విరాట్ ఇదే తన చివరి అంతర్జాతీయ టీ ట్వంటీగా ప్రకటించాడు. వరల్డ్ కప్ గెలవడంతో తన కల నెరవేరిందన్నాడు. యువ ఆటగాళ్ళకు అవకాశమివ్వాల్సిన సమయం వచ్చిందని, అందుకే రిటైర్మెంట్ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించాడు. కాగా 2010లో జింబాబ్వేపై అంతర్జాతీయ టీ ట్వంటీల్లోకి అడుగుపెట్టిన కోహ్లీ తన కెరీర్ లో 125 మ్యాచ్ లు ఆడి 48.69 సగటుతో 4188 పరుగులు చేశాడు. దీనిలో 1 సెంచరీ , 38 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. అంతర్జాతీయ టీ ట్వంటీలకు గుడ్ బై చెప్పిన విరాట్ ఐపీఎల్ లో మాత్రం కొనసాగనున్నాడు.





# క్యూట్ స్టైల్ తో కట్టిపడేస్తున్న నివేదా పెతురాజ్.. లేటెస్ట్ పిక్స్ వైరల్

నివేదా పెతురాజ్ మోడలింగ్ నుంచి హీరోయిన్ గా ల్లోకి అడుగు పెట్టింది ఈ ముద్దుగుమ్మ. తమిళ్ ఇండస్ట్రీలో పలు లతో మెప్పించింది. అక్కడ మంచి పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ ఆతర్వాత తెలుగులోకి అడుగు పెట్టింది.నివేదా పెతురాజ్ మోడలింగ్ నుంచి హీరోయిన్ గా ల్లోకి అడుగు పెట్టింది ఈ ముద్దుగుమ్మ. తమిళ్ ఇండస్ట్రీలో పలు లతో మెప్పించింది. అక్కడ మంచి పేరు తెచ్చుకున్న ఈ బ్యూటీ ఆతర్వాత తెలుగులోకి అడుగు పెట్టింది.



# టాలీవుడ్ కొత్తందం.. ప్రణవి మానుకొండ .. లేటెస్ట్ పిక్స్ చూస్తే ఫిదా అవ్వాల్సిందే

టాలీవుడ్ లో కొత్త అందాలు పలకరింపు ఈ ఈ మధ్య ఎక్కువైంది. చాలా మంది కొత్త భామలు హీరోయిన్స్ గా ఎంట్రీ ఇస్తున్నారు వారిలో ప్రణవి మానుకోండ ఒకరు. ఈ ముద్దుగుమ్మ చాలా మందికి తెలిసే ఉంటుంది.టాలీవుడ్ లో కొత్త అందాలు పలకరింపు ఈ ఈ మధ్య ఎక్కువైంది. చాలా మంది కొత్త భామలు హీరోయిన్స్ గా ఎంట్రీ ఇస్తున్నారు వారిలో ప్రణవి మానుకోండ ఒకరు. ఈ ముద్దుగుమ్మ చాలా మందికి తెలిసే ఉంటుంది.సోషల్ మీడియా ద్వారా చాలా మంది ల్లోకి వచ్చారు. ఆలాగే ప్రణవి కూడా సోషల్ మీడియా నుంచే ల్లోకి వచ్చింది. సోషల్ మీడియాలో రీల్స్ తో ఆకట్టుకుంటూ ఈ అమ్మడు బాగానే క్రేజ్ సొంతం చేసుకుంది.





# స్టైలిష్ అనసూయ.. చీరకట్టులో విష్ణు ప్రియ..

బ్లాక్ డ్రెస్‌లో హొయలుపోతూ ఫొటోలకు పోజులిచ్చారు మిర్నా మేనన్, నైనా గంగూలీ ఇక మొదలు పెడతాదామా అంటూ లేటెస్ట్ స్టిల్స్‌ను అనసూయ షేర్ చేసింది. చీరకట్టులో చిరు నవ్వులు చిందిస్తూ కనిపించింది యాంకర్ విష్ణు ప్రియ వీకెండ్‌ను ఆస్వాదిస్తున్నట్లు చెప్పింది నివేదా పేతురాజు.. ఇలా మన సినీతారలు సామాజిక మాధ్యమాల వేదిక పంచుకున్న ఆసక్తికర ఫొటోలు మీకోసం.. అనసూయ

# ఎట్టకేలకి తన తప్పుని ఒప్పుకున్న సమంత..




టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రత్యేక పరిచయాలు అక్కర్లేదు. ఒకప్పుడు టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన సమంత మయోసైటిస్ వలన ఏడాది పాటు సినిమాలకి బ్రేక్ ఇచ్చింది.ఇప్పుడు తిరిగి సినిమాలు చేసే ప్రయత్నం చేస్తుంది. అయితే సమంత క్రేజ్ తగ్గిపోయిందా అంటే అవుననే సమాధానం వస్తోంది. ఆమెకు పెద్దగా సినిమా ఆఫర్లు రావడం లేదనేది అక్షర సత్యం. విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'ఖుషి' సినిమా తరువాత సమంత ప్రేక్షకుల ముందుకు వచ్చింది లేదు. ఇటీవలే వరుస సినిమాలకు గ్రీన్ సిగ్రల్ ఇస్తోంది. "హనీ, బన్నీ" అనే బాలీవుడ్ వెబ్ సిరీస్‌లో సమంత హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ వెబ్ సిరీస్‌లో వరుణ్ ధావన్ హీరోగా నటిస్తున్నాడు. ఈ వెబ్ సిరీస్ త్వరలో స్ట్రీమ్ కానుంది.ఇక అల్లు అర్జున్, అట్లీ మూవీ కాంబినేషన్‌లో తెరకెక్కే సినిమాలో కూడా హీరోయిన్‌గా సమంతను ఎంపిక చేసినట్టు వార్తలు వచ్చాయి. కాని ఈ ప్రాజెక్ట్ సమంత చేతి నుండి జారిపోయినట్టు సమాచారం. ఇక ఇదిలా ఉంటే సమంత కొంత కాలంగా టే కొంత కాలంగా ఆరోగ్యంపై పాడ్ కాస్ట్ చేస్తోంది. ఆల్కేష్ సహెూత్రితో కలిసి టేక్ 20 అనే పేరుతో పాడ్ కాస్ట్ రిలీజ్ చేసింది. ఇందులో ఆరోగ్యానికి సంబందించిన టిప్స్ ని ఫ్యాన్స్ తో సమంత పంచుకుంది. ఆరోగ్యకరమైన ఫుడ్స్ ని పాడ్ కాస్ట్ ద్వారా సమంత ప్రమోట్ చేస్తోంది. ఓ నెటిజన్ సమంత చెబుతున్న ఆరోగ్యకరమైన టిప్స్ పై కామెంట్ చేశాడు.ఇప్పుడు ఇవన్నీ చెబుతున్నారు బాగానే ఉన్నాయి. గతంలో మీరు అనారోగ్యకరమైన బ్రాండ్స్ ని ప్రమోట్ చేశారు కదా దానికి ఏం సమాధానం చెబుతారని అడిగాడు. సమంత ఆ కామెంట్ పై రియాక్ట్ అయ్యింది. గతంలో నేను కొన్ని తప్పులు చేసిన మాట వాస్తవమే. అయితే అవి పూర్తిగా తెలియక చేసినవి మాత్రమే అని సమంత చెప్పుకొచ్చింది. వాటి గురించి తెలిసాక పూర్తిగా ఆపేశాను. ఇప్పుడు నేను ఏవైతే పాటిస్తున్నానో వాటి గురించే చెబుతున్నాను అని పేర్కొంది. మొత్తానికి సమంత తన తప్పుని తెలసుకొని రియలైజ్ అయినట్టు అర్ధమవుతుంది. ఈ మధ్యకాలంలో ప్రజలలో కూడా హెల్త్ పై ఎక్కువ ఫోకస్ పెరిగింది. దానిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యకరమైన ఆహారపదార్థాలు తీసుకోవడం, హెల్త్ టిప్స్ ఫాలో కావడం చేస్తున్నారు. అందుకే సమంత కూడా వాటిపై అవగాహన పెంచే ప్రయత్నం చేస్తుంది.

# 'ఈనాడు' అంటే ప్రజలకు అంత నమ్మకం: పరుచూరి గోపాలకృష్ణ

**ఇంటర్నెట్‌డెస్క్:** రామోజీ గ్రూప్ సంస్థల అధినేత రామోజీరావు జీవితం నుంచి ఎన్నో మంచి పాఠాలు నేర్చుకోవచ్చని ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ అన్నారు.క్రమశిక్షణకు, నమ్మకానికి రామోజీ మారుపేరని కొనియాడారు. ఆయన గొప్పతనాన్ని వివరిస్తూ పరుచూరి ప్రత్యేక వీడియో షేర్ చేశారు. రామోజీ ప్రభుత్వానికి పరుచూరి కృతజ్ఞతలు చెప్పారు.'ఏ పత్రికలో అయినా వార్త వస్తే.. ఇది 'ఈనాడు'లో వచ్చిందా అని ప్రజలు అడుగుతారు. అంటే ఈనాడులో వస్తే ఏ వార్తనైనా నమ్మొచ్చని దానర్థం. రామోజీరావు జర్నలిజం విషయంలో రాజీపడ లేదు. ఆయన పడినన్ని ఇబ్బందులు, చేసినన్ని పోరాటాలు ఎవరూ చేయలేదు. ఒక పత్రికాధిపతిగా ఆయనకు హ్యాట్సాఫ్ చెప్పాలి. నిజాలే రాయమని చెప్పేవారు. నందమూరి తారకరామారావు, రామోజీరావు ఇద్దరూ భారతరత్నకు అర్హులు. సినిమా రంగంలో ఎన్టీఆర్ , పత్రికా రంగంలో రామోజీ ఎన్నో అద్భుతాలను సృష్టించారు. వీళ్లిద్దరూ ప్రపంచానికి దశ, దిశ నిర్దేశించిన మహానుభావులు. ఈసారి భారతరత్న అవార్డులను ప్రకటించే సమయంలో ఈ ఇద్దరికీ (ఎన్టీఆర్, రామోజీరావు) ఇవ్వాలని తెలుగువారందరి తరఫున ప్రధాని మోదీని కోరుతున్నాను'.'మా కుటుంబానికి రామోజీతో మంచి అనుబంధం ఉంది. ఆయన నిర్మించిన 'మౌనపోరాటం' సినిమా కోసం మొదటిసారి మేం వర్క్ చేశాం. రామోజీ ఎప్పుడూ సందేశాత్మక చిత్రాలనే నిర్మించేవారు. ఆయనకు చాలా విషయాలపై పట్టు ఉండేది. 'మౌనపోరాటం' కోసం చర్చలు జరిపినప్పుడు ఆ విషయం అర్థమైంది. 'మయూరి' సినిమా ఒక సంచలనం. ఎంతో ధైర్యంగా తీసి విజయాన్ని అందుకున్నారు. సినిమా, పత్రిక ఇవి రెండూ ఆయనకు రెండు కళ్లు. గొప్ప వ్యక్తిత్వం ఉన్న మనిషి' అంటూ రామోజీరావుతో ఉన్న అనుబంధాన్ని పరుచూరి





గోపాలకృష్ణ గుర్తుచేసుకున్నారు. ఆరోగ్యం సహకరించని కారణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంస్మరణ సభకు హాజరుకాలేకపోయినట్లు తెలిపారు.